క్లుప్తంగా

పాలిటెక్నిక్ మోడల్ టెస్ట్‌కు విశేష స్పందన


పాలిటెక్నిక్ మోడల్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం : పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పాలిటెక్నిక్ మోడల్ టెస్ట్‌కు విశేష స్పందన వచ్చింది. ఉచిత కోచింగ్ సెంటర్ విద్యార్థులతో పాటు జిల్లా స్థాయిలో పలు పాఠశాలల నుంచి 117 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరైనట్టు నిర్వాహకులు పీఆర్‌టీయూ నాయకుడు శ్రీనివాసరావు తెలిపారు. ఈ పరీక్షకు అవసరమైన మోడల్ టెస్ట్ పేపర్స్ వింగ్స్ ఫౌండేషన్ సభ్యుడు ముద్రించినట్టు తెలిపారు. ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభించిన అతి తక్కువ రోజుల్లోనే జిల్లా స్థాయిలో మోడల్ టెస్ట్ నిర్వహించడం పట్ల పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ అభినందనలు తెలిపారు.

చివరి దశకు చేరిన వరి నూర్పులు

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో వరి నూర్పులు పనులు చివరి దశకు చేరుకున్నాయి. మండలంలో ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి 9వేల ఎకరాల్లో వరి పంట సాగు జరిగింది. వాతావరణం అనుకూలించడం , శారద నదిలో నీరు పుష్కలంగా ప్రవహించడంతో పంట బాగా పండింది. అంతేగాక దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో పాటు ధర కూడా గత ఏడాదితో పోలిస్తే బస్తాకు రూ 300 అదనంగా పలుకుతుంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా పాటిపల్లి మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష


పాటిపల్లి మోడల్ స్కూల్లో పర్యటిస్తున్న విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు శామ్యూల్

మునగపాక : మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశాల కోసం ఏర్పాటు చేసిన ప్రవేశపరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మండల వ్యాప్తంగా 5వతరగతి పూర్తి చేసుకొని ఆరో తరగతిలో ప్రవేశించేందుకు 289 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 244 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష జరుగుతున్న తీరును రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకుడు ఎం.ఆర్.ఎ శామ్యూల్ పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో వేణుగోపాల రావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ఉన్నారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవం

మాడుగుల రూరల్: మాడుగుల –దబ్బకుంటు రహదారిలో పురాతన ఉమా భీమలింగేశ్వర ఆలయంలో నూతనంగా సోమవారం ఉదయం 10 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు.

మేము కూడా సిద్ధమే..

- వైఎస్సార్‌సీపీలో జోష్ నింపిన బస్సుయాత్ర
- నేడు అభ్యర్థి జోగులు నామినేషన్
- భారీగా తరలిరానున్న అభిమానులు, పార్టీ శ్రేణులు


బస్సుయాత్రలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల జోష్ (ఫైల్)

నక్కపల్లి : ఎన్నికలకు మేము సిద్ధం పేరుతో వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి శనివారం పాయకరావుపేట నియోజకవర్గంలో నిర్వహించిన బస్సుయాత్ర పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. శుక్రవారం రాత్రి బస్సుయాత్ర జిల్లాలోకి ప్రవేశించింది. రాత్రి 10 గంటల సమయంలో పాయకరావుపేట వద్ద అభిమానులు ఘన స్వాగతం పలికారు. అదే రోజు రాత్రి నక్కపల్లి మండలం గొడిచర్ల వద్ద బస చేసిన జగనన్న శనివారం ఉదయం గొడిచర్ల నుంచి బస్సుయాత్ర ప్రారంభించారు. గొడిచర్ల నుంచి పెనుగొల్లు వరకు నియోజకవర్గపరిధిలో దాదాపు 25 కిలోమీటర్ల పొడవునా అభిమానులు జగనన్నకు ఘన స్వాగతం పలికారు. వయోభేదం లేకుండా అందరూ జగనన్నను చూసి తమ దీవెనలు అందించేందుకు తరలి రావడం విశేషం. ఈ బస్సుయాత్ర కార్యకర్తల్లో మంచి ఉత్సాహం నింపింది. ఇదే స్ఫూర్తితో సోమవారం జరిగే అభ్యర్థి కంబాల జోగులు నామినేషన్‌ను విజయవంతం చేయడానికి సిద్ధమవుతున్నారు. ఉదయం 11 గంటలకు జోగులు నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యతను సీనియర్ నాయకులు డీవీ సూర్యనారాయణరాజు, వీసం రామకృష్ణ, చిక్కాల రామారావు, బొలిశెట్టి గోవిందు, దత్తుడు సీతబాబు, శీరం నర్సింహమూర్తి, దనిశెట్టి బాబూరావు, పైలా రమేష్, కొణతాల శ్రీను, దగ్గుపల్లిసాయి, లంకసూరిబాబు తదితరులు భుజాన వేసుకున్నారు.

‘వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు సిద్ధం’


రేవుపోలవరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గోవిందు


గుడివాడలో ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

ఎస్.రాయవరం : గ్రామాల్లో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఫ్యాను గుర్తుకు ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని గుడివాడ సర్పంచ్ దూళి శ్రీనుబాబు , వైఎస్సార్‌సీపీ నాయకులు పేరిచర్ల శ్రీపతిరాజు, చోడిపల్ల గోవిందు అన్నారు. రేవుపోలవరం, గుడివాడ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు గెలుపునకు ప్రతి ఒక్కరూ ఓటు వేసి రాష్ట్రంలో మరో మారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, అచ్చుతరామరాజు, రాముురాజు ,చోడిపల్లి వెంకటరమణ,అప్పలరాజు పల్గొన్నారు.

నామినేషన్ కార్యక్రమానికి తరలి రండి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పాయకరావుపేట : వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులు సోమవారం నామినేషన్ వేయనున్న దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా కోరారు. పార్టీ కార్యాలయంలో వీరు సాక్షితో మాట్లాడుతూ సోమవారం ఉదయం నక్కపల్లిలో నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలన్నారు. ఉదయం 8 గంటలకు పార్టీ కార్యాలయం వద్దకు అందరూ హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు డి.నానాజీ, పంచాయతీ వార్డు సభ్యులు ధనిశెట్టి మహేష్, పిరాధి రాజు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి వేమగిరి లక్ష్మణ్, మాజీ వార్డు సభ్యులు కొశిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నబాబు మళ్లీ గెలవాలని పాదయాత్ర


కాలినడకన కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్తున్న పక్కుర్తి శంకర్, కొఠారు నాగేశ్వర్రావు

యలమంచిలి రూరల్ : యలమంచిలి ఎమ్మెల్యే,వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు(కన్నబాబు) నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికల్లో గెలవాలని ఆకాంక్షిస్తూ యలమంచిలి పట్టణం కాకివానివీధికి చెందిన పక్కుర్తి శంకర్, ధర్మవరం వీధికి చెందిన కొఠారు నాగేశ్వర్రావు ఆదివారం యలమంచిలి నుంచి కశింకోట కనకదుర్గమ్మ ఆలయం వరకు పాదయాత్ర చేశారు. కన్నబాబురాజు దుర్గమ్మ ఆశీస్సులతో నాలుగోసారి కూడా తప్పకుండా ఎమ్మెల్యేగా గెలవాలన్నదే తన బలమైన కోరికగా వారిద్దరూ చెప్పారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకుని సుమారు 20 కిలోమీటర్లు నడిచి వెళ్లి అమ్మవారికి తమ కోరికను చెప్పుకున్నట్టు వారు తెలిపారు. పాదయాత్ర చేసిన పక్కుర్తి శంకర్ పట్టణంలో 8వ వార్డు వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్‌గా పనిచేస్తున్నారు.

ఎండ దెబ్బకు విలవిల

రాంబిల్లి : ఎండ దెబ్బకు మండలవాసులు విలవిలలాడారు. ఆదివారం భానుడు భగభగలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు దుకాణాలు తెరవడం లేదు. ఎండ తీవ్రతకు రైతులు , కూలీలు మరింత ఇబ్బంది పడుతున్నారు. అయితే సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారింది. ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీశాయి. దీంతో ప్రజలు కాస్త సేద తీరారు.

గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి విరాళం


ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మూలపేటలో నూతనంగా నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి దాతలు తమవంతు సహకారాన్ని అందిస్తున్నారు. ఆదివారం గంగాదేవిపేటకు చెందిన ఆడారి అప్పారావు కుమారుడు శ్రీనివాసరావు, అన్నపూర్ణ దంపతులు రూ.10,216 విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సర్పంచ్ గంగప్పలనాయుడు కోరారు.

నేడే ప్రధాన పార్టీ అభ్యర్థుల నామినేషన్


నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐలు

నక్కపల్లి : ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. అధికార, ప్రతిపక్షపార్టీ అభ్యర్థుల నామినేషన్ వేసే కార్యక్రమం ఒకేరోజు ఉండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లను నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో దాఖలు చేయాల్సి ఉంటుంది. వైఎస్సార్‌సీపీ తరఫున కంబాల జోగులు, టీడీపీ తరఫున వంగలపూడి అనిత సోమవారం నామినేషన్ వేసేందుకు ముహూర్తం నిర్ణయించుకున్నారు. ఇరు పార్టీలకు చెందిన అభిమానులు ఈ కార్యక్రమానికి భారీగా తరలిరావడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమయింది. పోలీసులు నామినేషన్ కేంద్రానికి 200 మీటర్ల దూరం నుంచే బారికేడ్లు ఏర్పాటు చేశారు. జాతీయరహదారిపై ఎంపీడీవో కార్యాలయం ముందు బారికేడ్లు ఏర్పాటు చేశారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే కేంద్రం వద్దకు అనుమతిస్తున్నారు. ఈ సందర్భంగా నామినేషన్ కార్యక్రమాన్ని ప్రశాంతంగా పూర్తి చేసుకోవాలని సీఐ విజయ్‌కుమార్ రాజకీయ పార్టీ నేతలకు విజ్ఞప్తి చేశారు. ఎటువంటి కవ్వింపు చర్యలు ఘర్షణలకు తావులేకుండా నిర్ణయించుకున్న ముహూర్తం ప్రకారం అభ్యర్థులు వెళ్లి నామినేషన్ ప్రక్రియ పూర్తిచేసుకోవాలన్నారు. జాతీయరహదారిపై ర్యాలీలకు సభలకు, సమావేశాలకు అనుమతి తీసుకోవాలన్నారు. నామినేషన్ కేంద్రం వద్ద ఇన్‌చార్జ్ డీఎస్పీ అప్పారావు పర్యవేక్షణలో సీఐలు అప్పన్న, అప్పలరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు పిలుపు


కంబాల జోగులు

నక్కపల్లి : పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సోమవారం నామినేషన్ దాఖలు చేస్తున్నానని నాలుగు మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ జగనన్న ఆశీస్సులతో నాలుగు మండలాల సీనియర్ నాయకులు , కార్యకర్తలు, అభిమానుల అండదండలతో ఉదయం 11 గంటలకు నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ నలుమూలల నుంచి అభిమానులంతా వచ్చి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, మీ ఆశీస్సులు అందజేయాలని కోరారు. మీ అందరి ఆదరాభిమానాలతో ఎమ్మెల్యేగా నాలుగోసారి విజయం సాధిస్తానన్న నమ్మకం ఉందన్నారు. పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్న జగనన్న ఆదేశాలతో ఇక్కడ నుంచి పోటీ చేయడం జరుగుతోందన్నారు. మీరంతా నన్ను భారీ మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలని, మీకు సేవకుడిగా ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు


పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న గోవిందు

ఎస్.రాయవరం : టీడీపీకి కంచుకోటగా ఉన్న కోనవానిపాలెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మరింత బలంగా మారిందని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రలో కొందరు, ఆదివారం మరికొందరు వైఎస్సార్‌సీపీలో చేరినట్టు చెప్పారు. ఈ మేరకు గోవిందరావు, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి కండువా వేసి వారిని పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ కష్టపడి పని చేసినవారికి ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలో చేరినవారిలో కొర్ని నూకరాజు, కొర్ని బాబ్జి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి, వార్డు మెంబర్ వియ్యపు సింహాద్రి పాల్గొన్నారు.

బాధపడకండమ్మా.. నేనున్నాను

- అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురికి సీఎం జగన్ భరోసా

నక్కపల్లి(అనకాపల్లి జిల్లా): మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా శనివారం నక్కపల్లికి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వివిధ అనారోగ్య, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న పలువురు బాధితులు కలిశారు. తమను ఆదుకోవాలంటూ సాయం కోరారు. వారందరి గోడు విన్న సీఎం జగన్.. తానున్నానంటూ భరోసా ఇచ్చారు.

సలీం బేబీకి భరోసా




పాయకరావుపేటకు చెందిన షేక్ సలీం బేబీకి కాలికి ఇన్‌ఫెక్షన్ సోకడంతో ఆస్పత్రికి వెళ్లింది. ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు చెప్పడంతో.. కాలు తొలగించుకుంది. వైద్యానికి రూ.3 లక్షల వరకు ఖర్చయ్యిందని.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తనను ఆదుకోవాలని సీఎంను కోరింది. ఆమె గోడును సావధానంగా విన్న సీఎం జగన్ తప్పకుండా న్యాయం చేస్తానంటూ భరోసా ఇచ్చారు.

తప్పకుండా న్యాయం చేస్తా..



నక్కపల్లికి చెందిన షబీనాకు ఇబ్రహీం అనే ఇరవై ఏళ్ల కుమారుడున్నాడు. పుట్టుకతోనే ఫిట్స్ సమస్య ఉండటంతో.. మంచానికే పరిమితమయ్యాడు. ఎన్ని ఆస్పత్రులకు తీసుకెళ్లినా ఉపయోగం లేకపోవడంతో.. శనివారం సీఎం జగన్‌ను కలిసి తమ కుమారుడికి మెరుగైన వైద్యం కోసం సాయం చేయాలని కోరింది. సీఎం జగన్.. వెంటనే తన వ్యక్తిగత సిబ్బందికి చెప్పి వివరాలు తీసుకుని న్యాయం చేస్తామని ధైర్యం చెప్పారు.

బాధపడొద్దు.. ఆదుకుంటా



నక్కపల్లి మండలం ఉద్దండపురానికి చెందిన కుర్రా మోహన్‌కృష్ణ రెండేళ్ల క్రితం తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తూ జారి పడ్డాడు. దీంతో వెన్నుపూసకు దెబ్బతగిలింది. తండ్రి లేడు. తల్లి ప్రభుత్వ వసతి గృహంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తోంది. మోహన్‌కృష్ణ మూడు చక్రాల సైకిల్‌కే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో నక్కపల్లికి వచ్చిన సీఎం జగన్‌ను కలిసి వికలాంగుల పింఛన్ మంజూరు చేయించాలని కోరారు. సీఎం జగన్ స్పందిస్తూ.. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు.